
మంచినీళ్లవ్వండి మహాప్రభో..!

- తాగు, వాడుక నీళ్ల కోసం కె.అగ్రహారం గ్రామస్తుల అగచాట్లు
- పాచిపట్టి కలుషితమైన రక్షిత మంచినీటి బావి
- కలుషితమైన నీటిని తాగడానికి, వాడటానికి గ్రామస్తుల విముఖత
- ప్రైవేట్ వాటర్ ప్లాంట్స్ నుంచి బబుల్ వాటర్ తెచ్చుకుంటున్న వైనం
- అరకొర నీటి సరఫరాతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు


మంచినీటి స్కీం బావిలో పాచిపట్టి అపరిశుభ్రంగా ఉన్న నీళ్లు


పాలేరులోని స్కీం బావి ఇదే

పొన్నలూరు:

పాలకుల వైఫల్యం, అధికారుల నిర్లక్ష్యం వెరసి పల్లె జనం గొంతెండుతోంది. రక్షిత మంచినీటి పథకాల స్కీమ్ నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో తాగు, వాడుక నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కె.అగ్రహారం గ్రామంలో ప్రస్తుతం అదే పరిస్థితి ఏర్పడింది. ఈ గ్రామంలో సుమారుగా 500 కుటుంబాలు ఉన్నాయి. గ్రామస్తులకు నీటి కష్టాలు తొలగించడానికి కొన్నేళ్ల క్రితం లక్ష రూపాయలు వెచ్చించి గ్రామానికి సమీపంలోని పాలేరులో రక్షిత మంచినీటి స్కీమ్ బావిని ఏర్పాటు చేశారు. ఈ స్కీమ్ బావి నుంచి గ్రామంలో ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో పైపులైన్ ద్వారా నీటి నిల్వ చేసి ఇక్కడ నుంచి కుళాయిలతో గ్రామస్తులకు నీటిని అందిస్తున్నారు. కానీ ఇటీవల రక్షిత మంచినీటి పథకాన్ని సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు బావిలో కొంతమేర నీళ్లు ఉన్నా అవి పూర్తిగా పాచిపట్టి కలుషితమై అపరిశుభ్రంగా ఉన్నాయి. అయితే స్కీం బావిలో పాచిని తొలగించకపోవడంతో అనారోగ్యానికి గురవుతామని భావించి ఈ నీళ్లు తాగడానికి గ్రామస్తులు విముఖత చూపిస్తున్నారు. దీంతో కొన్ని రెండు నెలల నుంచి గ్రామంలో తాగు, వాడక నీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నీళ్ల సరఫరాలో ఆలస్యం...

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్కీం బావి నుంచి నీటి సరఫరాను స్థానిక టీడీపీ సానుభూతి పరుడుకి అప్పగించారు. దీంతో ఉదయాన్నే నీళ్లను వదలకుండా ఇష్టానుసారంగా ఎప్పుడో తొమ్మిది గంటలకు వదులుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పనులకు వెళ్లే రోజుల్లో ఇలా ఆలస్యంగా నీళ్లను వదిలితే ఎలా అని ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పకుండా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. కొన్ని కుటుంబాల ప్రజలు మంచి నీటి సౌకర్యం లేకపోవడంతో చేతి పంపుల్లో వచ్చే ఫ్లోరైడ్ నీటిని తాగుతూ అనారోగ్యానికి గురవుతున్నారు. స్కీం బావి నుంచి వచ్చే నీటిని వాడుక నీటిగా ఉపయోగిస్తున్నప్పటికీ అవి అవి అపరిశుభ్రంగా ఉండటంతో స్నానం చేసేటప్పుడూ శరీరం దురద వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు.

కలుషిత నీటితో ఆరోగ్య సమస్యలు..

స్కీం బావులను కనీసం రెండు నెలలకు ఒకసారైనా బ్లీచింగ్ పౌడర్‌తో పరిశుభ్రం చేసి గ్రామస్తులకు నీటిని సరఫరా చేయాలి. కాని ఇటువంటి చర్యలు ఎక్కడా కూడా జరగడం లేదు. దీంతో పాచిపట్టి వ్యర్థాలతో ఉన్న అపరిశుభ్రమైన నీటిని తాగు, వాడుక అవసరాలకు వినియోగించడం వలన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. కొందరు గత్యంతరం లేక ఈ నీటినే తాగడం వలన అనారోగ్యానికి గురవుతున్నారు.

బబుల్‌వాటరే దిక్కు.

పాలేరులోని రక్షిత మంచినీటి పథకం బావిలో భూగర్భజలాలు అడుగంటి, ఉన్న నీళ్లు కూడా పాచి పట్టి కలుషితంగా ఉండటంతో గ్రామస్తులు ఈ నీళ్ల తాగడానికి ముందుకు రావడం లేదు. అధికారులు కూడా అపరిశుభ్ర నీటిని శుద్ధి చేయించకపోవడంతో తాగునీటి కోసం గ్రామంలోని ప్రజలు అవస్థలు పడుతున్నారు. స్కీం బావిలోని నీళ్లు అపరిశుభ్రంగా ఉండటంతో చేసేది లేక స్థానికంగా ఉండే ప్రైవేట్ వాటర్ ప్లాంట్స్ బబుల్ వాటర్‌ను ఆశ్రయిస్తున్నారు. దీంతో గ్రామస్తులు ప్రైవేట్ వాటర్ ప్లాంట్స్ బబుల్ వాటర్‌ను కొనుగోలు చేయాల్సి వస్తోంది. అధికారులు స్పందించి స్కీం బావిలోని నీటిని శుభ్రపరిచి మంచినీళ్లు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


డిజిటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరణలో డాక్టర్ ఆదిమూలపు సురేష్

కార్యకర్తలకు అండగా 'డిజిటల్ బుక్'

- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: కూటమి ప్రభుత్వ అరాచక పాలనలో వైఎస్సార్ సీపీ శ్రేణులకు డిజిటల్ బుక్ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం రాత్రి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ ఆయన పాల్గొన్నారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ డిజిటల్ బుక్‌లో ఇప్పటికే నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 60 ఫిర్యాదులు నమోదయ్యాయని, ఒక్కో మండలం నుంచి 10 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఈ ఫిర్యాదులకు సంబంధించి కూటమి పార్టీల నాయకుల అండతో ఆయా మండలాల అధికారులు కారణంగా ఏవిధంగా అరాచకానికి గురయ్యారో ఆధారాలతో సహా త్వరలో బహిర్గతం చేస్తామని ప్రకటించారు. ప్రధానంగా తప్పుడు పోలీసు కేసులు, భూ కబ్జాలు, లంచం, అవినీతి, మోసం, దోపిడీ, వేధింపులు, వివక్ష, అనుకూలం లేదా ఇతరులు వంటి అంశాలపై డిజిటల్ బుక్‌లో స్కానర్ ద్వారా నమోదు చేశారని వివరించారు.

పంచాయతీ నిధులు స్వాహాకు పక్కా ప్రణాళిక..

నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కూటమి పార్టీల నాయకులు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకుని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అండదండలతో అవినీతికి పాల్పడుతున్నారని మాజీ మంత్రి సురేష్ ఆరోపించారు. ప్రతి గ్రామ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం, సాధారణ పంచాయతీ నిధులు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉన్నాయన్నారు. ప్రతి పంచాయతీలో వీధిలైట్లు వెలగక, మురుగు కాల్వల్లో మురుగు పేరుకుపోయి, తాగు నీటి వంటి సమస్యలు ఉన్నాయన్నారు. కానీ వైఎస్సార్ సీపీ సర్పంచులు నిధులు ఖర్చు చేసి సమస్యలు పరిష్కరించడానికి వీల్లేకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పార్టీ నాయకులు ఢాకా పిచ్చిరెడ్డి, బచ్చల కోటేశ్వరరావు, ఆళ్ల శ్రీనివాసులరెడ్డి, రాపూరి ప్రభావతి, షేక్ వస్సూరు, భువనగిరి సత్యన్నారాయణ, పుట్టా వెంకట్రావు, వై వసంతరావు, చుక్కా కిరణ్‌కుమార్, దాసు శ్రీను, పెరికాల సునీల్, షేక్ కరీం, గోళ్లమూడి ఆశోక్‌రెడ్డి, బల్లెల ప్రభాకరరెడ్డి, ఏపూరి శ్రీనివాసులు, వాయిల పున్నయ్య, బుజ్జమ్మ, షేక్ నౌషాద్, షేక్ అల్లాఉద్దీన్, షేక్ అల్లా, తన్నీరు రామకృష్ణ పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో దద్దాల నారాయణ యాదవ్, పార్టీ నేతలు

కనిగిరిరూరల్: పట్టణంలోని పాతకూచిపుడిపల్లిలో పోలేరమ్మ తల్లి (జీర్ణోద్ధరణ)నూతన నిర్మాణ మహోత్సవంలో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్, పార్టీ నేతలు కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నాయకులు దద్దాల నారాయణ యాదవ్‌ను, నేతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, పార్టీ మండల అధ్యక్షుడు మడతల కస్తూరిరెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, గాండ్లపర్తి ఆది నారాయణరెడ్డి, తమ్మినేని సుజాతరెడ్డి, దాసరి మురళీ, బొట్టు శ్రీను, బత్తుల ఏడుకొండలు, మందాది కృష్ణారెడ్డి, అయిమల్ల నాగమణి, వెంగళరావు గుప్తా, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, సిగా కృష్ణారావు, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, పలుకూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


పామూరులో మొక్కలు నాటుతున్న సభ్యులు

పామూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని మానవత స్వచ్ఛందసేవాసంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. మానవత స్వచ్ఛందసేవాసంస్థ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. భావితరాలకోసం నేటి యువత విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం పామూరులో గుండెచికిత్స చేయించుకుని విశ్రాంతి పొందుతున్న సంస్థ సభ్యులు సేగు కృష్ణయ్య, రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న సంస్థ సభ్యులు బండి రాందాస్‌లను పరామర్శించారు. సంస్థ అధ్యక్షుడు కె.రామిరెడ్డి, బైరెడ్డి జయరామిరెడ్డి, వెండిదండి వెంకటేశ్వరరెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి, ఎం మునలయ్య, తోట రమేష్, కోదూరి ప్రభాకర్, మితికాల నారాయణ, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి


వైఎస్సార్ సీపీలో చేరుతున్న యర్రంశెట్టి ప్రసాద్

మర్రిపూడి: తెలుగుదేశం పార్టీ అనుసరిస్తున్న విధానం నచ్చక వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు అంకేపల్లి పంచాయతీ సన్నమూరు గ్రామానికి చెందిన యర్రంశెట్టి ప్రసాదు అన్నారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సమక్షంలో యర్రంశెట్టి ప్రసాదు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనకు సురేష్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీ మండల అధ్యక్షులు ఇనుకొల్లు సుబ్బారెడ్డి, బోద రమణారెడ్డి, జెడ్పీటీసీ మాకినేని సుధారాణి వెంకట్రావు, మాచేపల్లి నాగయ్య, యర్రంశెట్టి వెంకట్రావు, పాలుగుండ్ల సుబ్బారెడ్డి, జుమ్మల ప్రసాదు, కొండ్రు ఇజ్రాయిల్, మాచేపల్లి హనుమంతరావు, వనిపెంట మల్లికార్జునరెడ్డి, మాకినేని రమణయ్య ఉన్నారు.

శ్రీనివాసులరెడ్డిని పరామర్శించిన దద్దాల


జక్కు శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న దద్దాల

పామూరు: మండలంలోని మోపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జక్కు శ్రీనివాసులురెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ బుధవారం రాత్రి శ్రీనివాసరెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి ఆరోగ్యం, వైద్యంపై ఆయనతో చర్చించి జాగ్రత్తవహించాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, టీచర్స్‌విభాగం జిల్లా అధ్యక్షుడు కె.రామిరెడ్డి, శ్రీరాం శ్రీనివాసులు, అంబవరపు లక్ష్మీనారాయణరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, బోయల మాధవ రెడ్డి, జె.గోవిందయ్య, బొట్లు హజరత్, గవిరెడ్డి బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నిపాడు విద్యార్థికి గోల్డ్‌మెడల్


మనోహర్

పొన్నలూరు: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 పరుగు పందెం పోటీల్లో చెన్నిపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థి డబ్బుకొట్టు మనోహర్ ప్రథమస్థానం పొంది గోల్డ్‌మెడల్ సాధించాడు. ఒంగోలులో బుధవారం జరిగిన 400, 800 మీటర్ల పరుగు పందెంలో ఘనత సాధించాడు. జిల్లా పోటీలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించి పాఠశాల, గ్రామానికి పేరుతెచ్చిన మనోహర్‌ని హెచ్‌ఎం వేణు, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకట్రావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

సురేష్‌ను సత్కరించిన డాక్టర్ వెంకయ్య


సురేష్‌ను సత్కరిస్తున్న డాక్టర్ వెంకయ్య

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య బుధవారం మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను పార్టీ క్యాంపు కార్యాలయంలో కలిసి ఘనంగా సత్కరించారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఆదిమూలపు సురేష్ కు, తనపై నమ్మకం ఉంచి ఎంపిక చేసిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఇటీవల స్వల్ప అనారోగ్యంతో బాధపడుతున్న సురేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన చైర్మన్


సచివాలయ ఉద్యోగిని ప్రశ్నిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: సచివాలయంలో ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో లేకుండా సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడం సరైంది కాదని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఒకటవ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ సచివాయలంలో 9 మంది ఉద్యోగులకు గాను ఇద్దరు మాత్రమే ఉండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేల పేరుతో ప్రజలకు అందుబాటులో లేకుండా పోయి అర్జీదారులను ఇబ్బంది పెట్టడం సరైంది కాదన్నారు. గతంలో సచివాలయ ఉద్యోగులు కార్యాలయంలో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించి సమస్యలు పరిష్కరించేవారన్నారు. సచివాలయాల్లో విలువైన రికార్డులు భద్రత లేకుండా ఉండటం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నోడల్ అధికారులు పర్యవేక్షణలోపంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు మండల సమావేశం

టంగుటూరు: మండల సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2:30 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దేవసేనకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొనాలని కోరారు.

మర్రిపూడి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 10న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు నివేదికలతో హాజరు కావాలని కోరారు.

మండలంలో మోస్తారు వర్షం


పామూరులో కురుస్తున్న వర్షం

పామూరు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో మోస్తారు వర్షం కురిసింది. ఇటీవల తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతుండగా మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వర్షంతో అటు బత్తాయి, నిమ్మ సాగు రైతులతో పాటు పశుపోషకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్‌కి అనుగుణంగా బేళ్లు తీసుకురావాలి


వేలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి రీజనల్ మేనేజర్ శీలం రామారావు

కొండపి: పొగాకు రైతులు మార్కెట్‌కు అనుగుణంగా బేళ్లు తీసుకురావాలని బోర్డు రీజనల్ మేనేజర్ శీలం రామారావు అన్నారు. స్థానిక వేలం కేంద్రంలో జరుగుతున్న వేలాన్ని పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ధరల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. 2025-26 పంట కాలానికి బోర్డు అనుమతించిన పరిధిలోనే పంటను సాగు చేయాలని సూచించారు. రైతులు తమ వద్దనున్న అన్ని రకాల బేళ్లను వేలానికి తీసుకురావాలన్నారు. వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్, రైతులు, బోర్డు సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

కనిష్ట ధరలు మరింత పతనం

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కనిష్ట ధరలు మరింత పతనమయ్యాయి. నిన్న మొన్నటి వరకు రూ.90 కి కొనుగోలు చేసి వ్యాపారులు బుధవారం రూ.20 తగ్గించి రూ.70కే కొనుగోలు చేశారు. వేలానికి చింతలపాలెం, దావగూడూరు గ్రామాల రైతులు 1090 బేళ్లను వేలానికి తీసుకురాగా 924 బేళ్లను కొనుగోలు చేసి 166 బేళ్లను తిరస్కరించారు. సరాసరి ధర రూ.213.64గా నమోదైంది. వేలంలో 43 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో కనిష్ట ధర రూ.70కి పడిపోయింది. కస్టర్ పరిధిలోని గోగినేనివారిపాలెం, అక్కచెరువుపాలెం, పైడిపాడు గ్రామాల రైతులు 1137 బేళ్లను వేలానికి తీసుకురాగా 1012 బేళ్లను కొనుగోలు చేసి 125 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.315 పలికింది. వేలంలో 14 కంపెనీలు పాల్గొన్నాయి.

చీటింగ్ కేసు నమోదు

పీసీపల్లి: పాస్ పుస్తకాలు చేయిస్తానని నగదు తీసుకొని మోసం చేసిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని పెదయిర్లపాడుకు చెందిన అద్దంకి రామయ్య, అత్యాల బాలయ్య, అరగల సుందరం, అత్యాల దావీదు, అత్యాల వినోద్‌బాబు, అద్దంకి పేరయ్య, విశ్రాంతమ్మలు తమకు చెందిన భూమికి పాస్ పుస్తకం చేయించాలని 2023లో అప్పటి ఇర్లపాడు వీఆర్‌ఓ సుబ్బారావు తనయుడు సత్యనారాయణకు రూ.3.10 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. సత్యం కాలం గడిచే కొద్ది పని చేయకపోగా డబ్బులు తిరిగివ్వలేదు. దీంతో తమ డబ్బులు తమకివ్వమని గట్టిగా అడుగగా ఈ ఏడాది మే , జులైలో రూ.80వేలు ఇచ్చి ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని బెదిరించడంతో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు సత్యం పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై కోటయ్య తెలిపారు.

అడవులను సంరక్షించి వన్యప్రాణులను కాపాడుదాం

పామూరు: అడవులను సంరక్షించి వన్యప్రాణులను కాపాడుకుందామని డీఆర్‌ఓ వెంకటసుబ్బయ్య అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని నర్రమారెళ్ల ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు అడవుల రక్షణ, ఆవశ్యకత, వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సిబ్బంది సుభద్ర, జిలాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు


మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

సీఎస్‌పురం(పామూరు): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసు నమోదు చేస్తామని ఎస్సై ఎం.వెంకటేశ్వరనాయక్ అన్నారు. మండలంలోని డీజీపేట రోడ్డు, పామూరు రోడ్డులలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బైక్ నడిపేవారు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని అదేవిధంగా హెల్మెట్ ధరించాలని లేనిచో కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

శివారు ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు


కెమెరాల ఏర్పాటుపై సూచనలు చేస్తున్న ఫారెస్ట్ రేంజర్ తుమ్మా ఉమా మహేశ్వరరెడ్డి

వెలిగండ్ల(కనిగిరిరూరల్): మండలంలోని నాగిరెడ్డిపల్లి, వెదుళ్ల చెరువు, గుడిపాటిపల్లి ఫారెస్ట్ బీట్ కొండ ప్రాంతాల్లో ఫారెస్ట్ అధికారులు బుధవారం ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. కనిగిరి ఫారెస్ట్ రేంజ్ అధికారి తుమ్మా ఉమామహేశ్వరరెడ్డి క్షేత్ర స్థాయి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వన్యప్రాణులు బయటకు వచ్చే ప్రాంతాల్లో, కొండ కింద గ్రామ ప్రాంత సరిహద్దుల్లో, రైతులు పొలాలకు వెళ్లే ప్రధాన కొండ ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలను అమర్చారు. కొండ కింద ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలతో మాట్లాడి... వన్యప్రాణుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీట్ ఆఫీసర్ నవీన్‌కుమార్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైనీ టీచర్లకు ఈగల్ టీం అవగాహన


మాట్లాడుతున్న సీఐ ఎస్‌కే ఖాజావలి

కనిగిరిరూరల్: శిక్షణలో ఉన్న ఉపాధ్యాయులకు ఈగల్ టీం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎస్‌కే ఖాజావలి మాట్లాడుతూ విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తూ, వాటికి ఏ విధంగా దూరంగా ఉండాలో వివరించాలన్నారు. సైబర్ నేరాలు, మోసాల గురించి అవగాహన కల్పించారు. ఎంఈఓ ఉడుముల నారాయణరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలించిన డీఎస్పీ


పోలీస్‌స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

హనుమంతునిపాడు: మండల కేంద్రంలో సుమారు రూ.50 లక్షలతో నిర్మిస్తున్న పోలీస్‌స్టేషన్ భవనాన్ని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పోలీస్‌స్టేషన్ ప్రారంభించాలన్నారు. కనిగిరిలో ఉన్న హనుమంతునిపాడు పోలీస్‌స్టేషన్‌ను మండల కేంద్రానికి మార్చాలన్నారు. అనంతరం నూతన పోలీస్‌స్టేషన్‌లో అన్ని గదులు పరిశీలించారు. ఆయన వెంట సీఐ ఖాజావలి, ఎస్సై కె.మాధవరావు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

- ఐదుగురు జూదరుల అరెస్టు


పట్టుబడిన జూదరులతో ఎస్సై

టంగుటూరు: మండలంలోని వల్లూరు చాకలికుంట వద్ద కోడి పందేల శిబిరంపై ఎస్సై నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో దాడి చేశారు. దాడిలో ఐదుగురు జూదరులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి రూ.5,601 నగదు, ఒక కోడిని స్వాధీనం చేసుకున్నారు. పేకాట, కోడి పందేలు, ఇతర అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రీ సర్వేపై నేడు గ్రామసభ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని నలజనంపాడులో జరిగిన రీ సర్వేకు సంబంధించి డీఎల్‌ఆర్ తుది పబ్లికేషన్‌పై గురువారం ఉదయం గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్ తెలిపారు. గ్రామసభకు నలజనంపాడు రెవెన్యూ పరిధిలో భూములు కలిగిన రైతులు హాజరై వారి రికార్డులు పరిశీలించుకోవాలన్నారు.